క్లుప్తంగా

27 మండల మీట్

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27వ తేదీన ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. మండలంలో ఇప్పటివరకు మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధిపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుందన్నారు. శాఖల వారీగా జరిగిన అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థికి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

చిల్లకూరు: మండలంలోని మోమిడి మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని ఆయుర్వేద వైద్యుడు కే చంద్రశేఖర్ విద్యార్థులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్టేదులోని హోమియో వైద్యశాల వైద్యుడు సురేష్, కాంపౌండర్ ప్రసాద్‌రెడ్డి, యోగా ఇన్‌స్ట్రక్టర్ సాయిరాం, సుగంధ, హెచ్‌ఎం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

రాపూరు: మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం సందర్భంగా బాబాకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాగడహారతి, అభిషేకం, బాబా జీవిత చరిత్ర పారాయణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

సైదాపురం: ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బంది బాధ్యతగా విధులను నిర్వర్తించాలని ఏపీడీ శ్రీహరిరెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది పని ప్రదేశాన్ని పరిశీలించి గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా పనులను చేయించాలన్నారు. కూలీలకు సంఖ్య కూడా పెంచాలన్నారు. కార్యక్రమంలోఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తడ/దొరవారిసత్రం: తడ, దొరవారిసతం మండలాల్లోని ఆదర్శపాఠశాలలో 7,8,9 తరగతుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు సౌజన్య, సీహెచ్ సుమలత బుధవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. దరఖాస్తు చేసున్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీన ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా



జెడ్పీ సీఈఓకు రాజీనామా పత్రం అందజేస్తున్న ప్రసన్న

రాపూరు: తాను వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేసినట్లు కే ప్రసన్న తెలిపారు. రాపూ రు వైస్ ఎంపీపీ పదవిలో ఉన్న తాను ఈనెల 9 వ తేదీ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేసి ఆ పత్రాన్ని బుధవారం నెల్లూరులోని జెడ్పీ సీఈ ఓ చిరంజీవికి అందజేసినట్లు తెలిపారు. పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం ఒక పదవిలో కొనసాగాల్సి ఉన్నందున తాను ఆ పదవికి రాజీనామా చేసినట్లు ఆమె తెలిపారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు

కోట: బాల కార్మికులతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారులు దుకాణ యజమానులను హెచ్చరించారు. బుధవారం కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ సురేష్‌కుమార్ కోట, విద్యానగర్‌లోని పలు దుకాణాల్లో బాలకార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. నలుగురు బాల కార్మికులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను బడికి పంపి చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

బాలాయపల్లి (శ్రీకాళహస్తి): స్థానిక కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్ మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఆర్బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. వెంగమాంబపురం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎస్.గీతిక, జే.కార్తీక్‌కు ప్రథమ బహుమతి రూ.5 వేలు, పిగిలాం హైస్కూలు విద్యార్థులు పి.ప్రశాంత్ కుమార్ ,పి.అభిషేక్‌కు ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు, నిడిగల్లు విద్యార్థులు టి.హరిణి, కె.సాయినాథ్‌కి తృతీయ బహుమతిగా రూ,3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ జమళ్ళ వెంకటరత్నయ్య, హెచ్‌ఎం రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వెంకటగిరి రూరల్: ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని 9వ బెటాలియన్ కమాండెంట్ పి ప్రకాష్ అన్నారు. మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని కమాండెంట్ పి ప్రకాష్, బ్రహ్మకుమారిస్ సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం యోగాసనాలు వేయించారు. కమాండెంట్ ప్రకాష్ మాట్లాడుతూ యోగా, ధ్యానం చేయడంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మస్థైర్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతేగాకుండా ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు దోహదపడుతుందన్నారు. వయసుతో ప్రమేయం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుగొండలో ర్యాలీ

ఓజిలి: మండలంలోని కురుగొండ హైస్కూలులో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మంజుల, హెచ్‌ఎం శారదాదేవి, ఉపాధ్యాయుల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యరక్ష

చిల్లకూరు: యోగాతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని ఉపాధి ఏపీఓ గిరిబాబు తెలిపారు. మండలంలోని కలవకొండలోని అమృత్ సరోవర్ వద్ద బుధవారం ఉపాధి కూలీలతో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా తరగతులు నిర్వహించారు. అనంతరం యోగా ఎలా చేయాలనే విషయాలపై ముద్రించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు బూదూరు నల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో వ్యాధినిరోధకశక్తి

రాపూరు: యోగాలో వ్యాధి నిరోధక శక్తి వస్తుందని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర అన్నారు. రాపూరు మండలం బొజ్జనపల్లె సమీపంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీహరి, వైశాలి, శివకుమార్ పాల్గొన్నారు.



కోట: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



గూడూరు రూరల్: యోగా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆంజనేయరెడ్డి

కలువాయిలో...

కలువాయి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అసోసియేట్ అధికారి జి.పెంచలపుల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు యువతతో యోగాసనాలు వేశారు.

కోటలో..

కోట: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ కళాశాలలో ఆ కాలేజీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మాధవయ్య, శోభారాణి పాల్గొన్నారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరురూరల్: పట్టణానికి సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.మోహన్, ప్రిన్సిపాల్ ధనుంజయ, వేదిక్‌యూనివర్సిటీ గురువు రవికుమార్, అజేయ చైతన్య పాల్గొన్నారు. అలాగే భారతీయ జనతా యువ మోర్చా గూడూరు శాఖ ఆధ్వర్యంలో శ్రీప్రజ్ఞ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గిద్దలూరి మనోజ్‌కుమార్, నాయకులు చైతన్య, కిరణ్, నవీన్, మహేష్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి (శ్రీకాళహస్తి): మండలంలోని నిడిగల్లు జెడ్పీ హైస్కూలులో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



చిల్లకూరు: కలవకొండలో యోగా సాధన చేస్తున్న ఉపాధి కూలీలు



వెంకటగిరి రూరల్: యోగాపై అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ ప్రకాష్







ఓజిలి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, కలువాయిలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు, రాపూరు: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కు 12 మంది ఎంపిక

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూలులో ప్రవేశానికి జరిగిన ఎంపికల్లో 12 మంది మండలస్థాయిలో ఎంపిక చేసినట్లు అంతర్జాతీయ పారా క్రీడాకారుడు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. ఈ ఎంపికల్లో నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలా ల్లోని ప్రభుత్వ పాఠశాలలో 4, 5 తరగతులు చదివే విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు. 5 మండలాలకు సంబంధించి 12 మంది క్రీడాకారులను ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో నాలుగో తరగతికి నలుగురు, ఐదుకు 8 మంది మండలస్థాయిలో ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 26 తేదీన తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి ఎంపికలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.



స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులు

ముగిసిన పోలేరమ్మ జాతర



పోలేరమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

దొరవారిసత్రం: మండలంలోని ఉచ్చూరులో నిర్వహిస్తున్న పోలేరమ్మ జాతర బుధవారంతో ముగిసింది. పదేళ్ల తరువాత స్థానికులు జాతర చేయడంతో చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజలు, భక్తులు భారీగా గ్రామానికి విచ్చేశారు. గుడి వద్ద మూడు రోజుల పాటు స్థానికులు వివిధ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరిపారు. చివరి రోజున గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. జాతర సందర్భంగా గ్రామంలో వివిధ రకాల బొమ్మలు దుకాణాలు ఏర్పాటు చేశారు. పిల్లల కోసం రంగురాట్నం, చిన్న జైయింట్ వీల్ తదితరాలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రధాన వీధులన్నీ ప్రజలు, చిన్నారులతో రద్దీగా మారాయి. పూజల్లో డీవీ సత్రం వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, నాయకులు బట్టా వెంకటరమణయ్య, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్ మధు తదితరలు పాల్గొన్నారు.



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బొమ్మల దుకాణాలు

విజేతలకు బహుమతులు ప్రదానం



పెళ్లకూరు: బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం భాస్కర్‌రావు, బ్యాంక్ మేనేజర్ వివేక్

పెళ్లకూరు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూలులో బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహక, నగదు బహుమతులు ప్రదానం చేశారు. 'ఆల్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీ' అనే అంశంపై ఆర్‌బీఐ ఆధ్వర్యంలో మండలంలోని ఏడు జెడ్పీ హైస్కూళ్లలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెళ్లకూరు జెడ్పీ హైస్కూలుకు చెందిన చంద్రహాసిని, శ్రావణి ప్రథమ బహుమతి సాధించగా రూ.5 వేలు, తాళ్వాయిపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సువర్ణ, గణేష్‌కు ద్వితీయ బహుమతి రూ.4 వేలు, చెంబేడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సాయితేజ, చెంచుయోగికి తృతీయ బహుమతి కింద రూ.3 వేలు ప్రోత్సాహక నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌రావు, బ్యాంక్ మేనేజర్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.



కలువాయి: బహుమతులు అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాసులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కలువాయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏపీజీబీ కలువాయి బ్యాంకు శాఖ సౌజన్యంతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు, ఎంఈఓ-2 జి.శేషగిరిరావు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో విజేతలను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు. కుల్లూరు హైస్కూలు విద్యార్థిని సీహెచ్ ధరణి మొదటి బహుమతి గెలుపొందగా, చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ తాసిఫా, షేక్ హఫీజ ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. మేనేజరు శ్రీనివాసులు విజేతలకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు మహేష్, పెంచలయ్యలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గుర్తించాలి

సైదాపురం: మండలంలో ఈ నెల 23 నుంచి అమలు చేయనున్న జగనన్న సురక్ష ద్వారా ప్రజల సమస్యలను గుర్తించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జగనన్న సురక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా తొమ్మిది రకాల సర్టిఫికెట్లు, నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలు టెక్నికల్ ప్రాబ్లమ్‌తో పరిష్కారం కాని సమస్యలను సత్వరమే గుర్తించాలన్నారు. సచివాలయ పరిధిలో వలంటీర్లతో జగనన్న సురక్ష పథకం కార్యక్రమాలపై దండోరా వేయించాలన్నారు. వలంటీర్ల, గృహసారథులు ఇంటింటికీ తిరిగి సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయం ఉద్యోగులతో పాటు మండల స్థాయి అధికారులు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మండలంలోని 19 సచివాలయాల్లో ఈ కార్యక్రమం అమలవుతుందని, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఎటువంటి రుసుం వసూలు చేయకుండా ఉచితంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ హైమావతి, ఏఈ భాస్కర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ

రుణాలు మంజూరు చేయాలి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి మహిళలకు రుణాలు మంజూరు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబాశివారెడ్డి తెలిపారు. సైదాపురం ఎంపీడీఓ కార్యాలయంలోని ఐకేపీ సమావేశ మందిరంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం రాధ ఆధ్వర్యంలో వీఏఓ, పొదుపు సంఘాల గ్రూపులీడర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పొదుపు మహిళలను ప్రోత్సహించేందుకు ఒక్కొక్కరికి రూ.35 వేలు రుణం మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించే బాధ్యతలు కూడా పొదుపు సంఘాల సభ్యులు పర్యవేక్షణ చేయాలన్నారు.

సేవలు అభినందనీయం

నాయుడుపేటటౌన్: భగవతి మల్లికాంబ ఆలయ నిర్వాహకులు చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని నాయుడుపేట అర్బన్ సీఐ నరసింహరావు అన్నారు. ఆలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. తొలుత సీఐ, నాయకులు, నిర్వాహకులు మల్లికాంబకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 65 మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని చెన్నై శంకర నేత్రాలయకు తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, వటుకనాథస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ అమాస వెంకట సుబ్బయ్య, మల్లికార్జున, రామనారాయణ, శంకర్ నేత్రాలయ వైద్యులు వెంకటమునె, అరవింద్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

బాలాయపల్లి(శ్రీ కాళహస్తి): పక్కాగృహాల పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ జహీర్‌అహ్మద్ అన్నారు. మండలంలోని నిండలి సచివాలయంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

యువకుడి పరిస్థితి విషమం

సైదాపురం: స్థానిక పోలీసుస్టేషన్‌లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడి పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు కథనం మేరకు.. రాపూరు మండలంలోని అక్కమాంబాపురం గ్రామానికి చెందిన వంగపాటి ఆకాష్‌రాంను ఓ వివాహిత మహిళ విషయమై విచారణ నిమిత్తం సైదాపురం పోలీసుస్టేషన్‌కు తీసుకుని వచ్చారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న పురుగుల మందు తాగి ఆకాష్‌రాం (22)ఆత్యహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

సమగ్ర విచారణ చేస్తున్నాం

పోలీసుస్టేషన్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఆకాష్‌రాం పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు డీఎస్పీ కోటారెడ్డి తెలిపారు. పోలీసులు మాత్రం యువకుడిపై ఎలాంటి దురుసుగా ప్రవర్తించలేదన్నారు. ఈ నెల 19వ తేదీన మస్తాన్ అనే వ్యక్తి తమ భార్య షమీరా కనిపించడంలేదంటూ ఫిర్యాదు చేశాడన్నారు. గతంలో కూడా అతని భార్యను ఆకాష్‌రాం తీసుకుపోవడంతో అనుమానంపై విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణలో కూడా షమీరాను డక్కిలిలో ఓ రూమ్‌ను అద్దెకు తీసుకుని అక్కడే ఉంచారని, తమ విచారణలో తెలిందన్నారు. ప్రేమికులు కావడంతో మనస్తాపం చెంది స్టేషన్‌లో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని డీఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసు విషయమై సమగ్ర విచారణ చేస్తున్నామని చెప్పారు. నిజానిజాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు. బాధ్యులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చికిత్స పొందుతున్న ఆకాష్‌రాం

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం

కోట: మండలంలోని కొత్తపట్నం, గోవిందపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను బుధవారం కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య, ఉపసర్పంచ్ ఉప్పల ప్రసాద్‌గౌడ్, కార్యదర్శి అల్లాబక్ష్ పరిశీలించారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

వెంకటగిరి: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి తాగునీరు సరఫరా కాని ప్రాంతాలు, పైప్‌లైన్లు, తాగునీటి పథకాల మోటార్లు పాడైన సందర్భాల్లో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని బీసీ కాలనీ, పీర్జాతిపేట తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

రాపూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని 8, 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బాంకు ఆఫ్ ఇండియా అఖిల భారత క్విజ్ పోటీలు నిర్వహించిందన్నారు. ఈ పోటీల్లో రాపూరు హైస్కూలుకు చెందిన మహేష్, మస్తానయ్య ప్రథమస్థానంలో నిలిచి రూ. 5వేలు, కండలేరు గురుకులానికి చెందిన అమృత, కౌసల్య ద్వితీయస్థానం దక్కించుకుని రూ. 4 వేలు, వేపినాపి జెడ్పీ హైస్కూలుకు చెందిన కార్తీక్, గోవర్ధన్ తృతీయస్థానంలో నిలిచి రూ. 3 వేలు బహుమతులు అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు: పట్టణంలో ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ మయూరి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హరినాథ్‌రెడ్డి, బలరాంరెడ్డి, రామ్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

దొరవారిసత్రం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం రీసర్వేతో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. దొరవారిసత్రం మండలంలోని ఏడు గ్రామాల్లో రీసర్వే పనులు స్థానిక రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. ఈ గ్రామాలకు చెందిన రీసర్వే రికార్డులను బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. అలాగే లింగంపాడు గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. రీసర్వేతో పలు భూసమస్యలు పరిష్కారం కావడంతోపాటు శాశ్వత భూ హక్కు పొందినట్లు రైతులు తెలిపారని ఆయన చెప్పారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి ఉన్నారు.



లింగంపాడులో రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్